క్లుప్తంగా

రైతు బజారులో సబ్సిడీపై టమాటాల విక్రయం

మైలవరం: మైలవరం రైతు బజారులో టమాటాలు సబ్సిడీపై విక్రయిస్తున్నారు. కిలో రూ.50కి ప్రత్యేక కౌంటర్ ద్వారా బుధవారం అమ్మకాలు జరిపారు. పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని రైతు బజారులో టమాటాలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అక్షరాభ్యాసాలు



నూజివీడు: స్థానిక హనుమాన్ జంక్షన్ రోడ్డులోని శ్రీ జ్ఞానసరస్వతీ ఆలయంలో బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తల్లిదండ్రులు వారి పిల్లలను సరస్వతీ ఆలయానికి తీసుకువచ్చారు. అమ్మవారిని దర్శించుకుని తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించారు. తెల్లవారు జామున ఐదు గంటల నుంచే భక్తుల తాకిడి మొదలై మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగింది. నూజివీడు – హనుమాన్ జంక్షన్ ప్రధాన రహదారి వెంబడి వాహనాల రద్దీ పెరగడంతో పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

స్వర్గపురికి రూ.లక్ష విరాళం



తిరువూరు: తిరువూరులో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్గపురిలో సదుపాయాల కల్పనకు బుధవారం ఓ వ్యాపారి రూ.లక్ష విరాళం అందజేశారు. తిరువూరుకు చెందిన జంగాల సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన భార్య బేబీ సరోజిని ఈ విరాళాన్ని తోసా ప్రతినిధులకు అందజేశారు. ఇప్పటివరకు రూ.9 లక్షల విరాళాలు వచ్చాయని, స్వర్గపురి అభివృద్ధికి దాతలు సహకరిస్తున్నారని తోసా సభ్యులు తెలిపారు.

బాలోత్సవం కార్యదర్శి జ్యోత్స్నకు నివాళి



తిరువూరు: తరుణీ తరంగాలు, బాలోత్సవాల నిర్వహణలో క్రియాశీలకంగా వ్యవహరించిన గుళ్లపల్లి జ్యోత్స్న మృతి తీరని లోటని తిరువూరు బాలోత్సవ కార్యదర్శి ఎం. హరికృష్ణ అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో జ్యోత్స్న చిత్రపటానికి బాలోత్సవ కమిటీ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడానికి బాలోత్సవాన్ని నిర్వహించడంలో జ్యోత్స్న చేస్తున్న కృషిని పలువురు శ్లాఘించారు.

మండల దీక్షలు ప్రారంభం



తిరువూరు: స్వామి అయ్యప్ప భక్తుల మండల దీక్షలు స్థానిక అయ్యప్ప దేవాలయంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు ఘంటసాల చక్రపాణి, దుర్గాప్రసాద్‌లు పలువురు దీక్షాపరులకు మాలలు వేశారు. మాలధారణ చేసిన భక్తులు పాటించాల్సిన నియమావళిని వారు వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మైలవరం: సీపీఎం మైలవరం మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. సీపీఎం మైలవరం మండల మహాసభ స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో బుధవారం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా వజ్రాల వెంకటరెడ్డి, రావూరి రమేష్, సందిపాము ఇస్సాక్, రావుల సుబ్బారావు, గురజాల రామారావు ఎన్నికయ్యారు. సీపీఎం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి డీవీ కృష్ణ, సీనియర్ నాయకులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం సులభతరం

ముసునూరు: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రైతులకు వ్యవసాయాన్ని సులభతరం చేస్తోందని వ్యవసాయాధికారి సందిపాము మధు మోహన్ అన్నారు. మండలంలోని లోపూడి, గోపవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటలకు నీటి సదుపాయాన్ని కల్పించే సూక్ష్మ సేద్యం పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ విభాగం ద్వారా అందుతున్న డ్రిప్‌లు, స్ప్రింకర్ల రాయితీలను తెలిపారు. జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్ పేరం కృష్ణ, మాజీ వైస్ సర్పంచ్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

జ్వరాల విజృంభణ

- అస్తవ్యస్తంగా తాగునీరు, పారిశుద్ధ్యం
- విష జ్వరాలతో పెరుగుతున్న మరణాలు
- ఆందోళనలో ప్రజలు



కొండపల్లి ఖిల్లా రోడ్డు గుంత క్వారీ ప్రాంతంలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ఇబ్రహీంపట్నం: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, పారిశుద్ధ్యం, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా లోపంతో కొండపల్లి మున్సిపాల్టీలో విష జ్వరాలు విజృంభించాయి. ఇటీవల కృష్ణానదికి పోటెత్తిన వరద, బుడమేరు వరదకు అనేక ప్రాంతాలు నీటి ముంపునకు గురయ్యాయి. వరద తగ్గిన అనంతరం పారిశుద్ధ్యం నిర్వహణలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో డెంగీ, మలేరియా, చికున్ గున్యా, విష జ్వరాల కేసులు పెరిగాయి. పట్టణ 7వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి నాగసుధతో పాటు మరో ముగ్గురు ఇప్పటికే జ్వరాలతో మృతి చెందారు.

జ్వరాలతో నలుగురు మృత్యువాత

విష జ్వరాలతో మున్సిపాల్టీ పరిధిలో ఇప్పటి వరకు నలుగురు మృత్యువాత పడ్డారు. ఆర్టీసీ బస్ డిపో వెనుక వైపున నివశించే 12 ఏళ్ల బాలుడు జాన్‌వెస్లీ విష జ్వరంతో, అదే ప్రాంతానికి చెందిన మరో యువకుడు అజయ్ (30) జ్వరంతో, మున్సిపాల్టీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కుంబా రామదాసు (52) జ్వరంతో, 7వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కుమ్మరి నాగసుధ (32) డెంగీ జ్వరంతో ఇటీవల మృతిచెందారు. మరో మున్సిపల్ కార్మికుడు చెదల శ్రీను విష పురుగు కాటుకు గురై చికిత్స పొంది ఇంటికి చేరాడు.

అధ్వానంగా పారిశుద్ధ్యం

కొండపల్లి మున్సిపాల్టీలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఇటీవలి కాలంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఓ సమావేశంలో పారిశుద్ధ్య కార్మికులు సరిపడినంత లేకపోవడంతో మున్సిపాల్టీలో చెత్త సమస్య తీవ్రమైందని ప్రకటించడం గమనార్హం. మున్సిపాల్టీలో ట్రాక్టర్లు మరమ్మతులకు గురికావడం వల్ల చెత్త తరలించలేక పోతున్నట్లు మరో అధికారి స్వయంగా ప్రజలకు చెప్పడం విశేషం. డ్రెయినేజీల్లో పూడికతీసే పనులు చేపట్టాలన్నా, తాగునీటి పైపులైన్ సమస్యలు పరిష్కరించాలన్నా మెటీరియల్ లేదు, కార్మికులు లేరు అని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. వరదల అనంతరం పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టకపోవడంతో వీధులన్నీ దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమలు, ఈగలు వృద్ధి చెందాయి. నివాసాల మధ్య పందులు సంచరిస్తున్నాయి. స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నివారణ చర్యలు విస్మరించడంతోనే జ్వరాలు విజృంభించాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వైద్య సిబ్బంది పర్యవేక్షణా లోపం..

మున్సిపాల్టీ పరిధిలో రెండు పీహెచ్‌సీలు, రెండు అర్బన్ పీహెచ్‌సీలు, ఒక ఈఎస్ఐ వైద్యశాల ఉన్నాయి. వైద్య సిబ్బంది పర్యవేక్షణా లోపంతో జ్వరాల బాధితులు ప్రైవేట్ వైద్యశాలలకు క్యూ కడుతున్నారు. పీహెచ్‌సీల్లో ఓపీల సంఖ్య 50 నుంచి 60 మంది వరకు ఉంటే వారిలో జ్వరాల సంఖ్య 20 నుంచి 30 మంది వరకు ఉంది. ప్రైవేట్ వైద్యశాలల్లో వీరి సంఖ్య రెట్టింపుగా ఉంటోంది. ప్రైవేట్ వైద్యులు, ఆర్ఎంపీల వద్దకు బాధితులు వెళితే పేషెంట్ కండిషన్ బాగోలేదని, తెల్లరక్త కణాల (ప్లేట్‌లెట్స్) సంఖ్య తగ్గుముఖం పట్టిందని, విజయవాడలోని కార్పొరేట్ వైద్యశాలలకు పంపడంతో రోగులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

పట్టించుకునేవారే లేరు



పారిశుద్ధ్యాన్ని పట్టించుకునే నాథుడే లేడు. వార్డులో సమస్యలు పరిష్కరించమని కోరితే పరికరాలు లేవని చెప్పడం పరిపాటిగా మారింది. తాగునీటి సమస్య, పారిశుద్ధ్య లేమి వల్లే జ్వరాలు విజృంభించి ప్రజలు మృత్యువాత పడుతున్నారు. అధికారులు స్పందించి మెరుగైన పారిశుద్ధ్యంతో జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలి.

– మొగిలి దయాసాగర్, కౌన్సిలర్, 5వ వార్డు

మురుగునీరు తొలగించడం లేదు



కొండపల్లి మున్సిపాల్టీలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. రోడ్లు, డ్రెయినేజీల్లో మురుగు నీరు తొలగించేవారు లేరు. నెలల తరబడి మురుగు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలకు ఆవాసంగా మారింది. అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదు. వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. పారిశుద్ధ్యం మెరుగుదలకు వెంటనే చర్యలు చేపట్టాలి.

– ఎస్.సాయి, స్థానికుడు, కొండపల్లి

చాట్రాయి అదనపు ఎంపీడీఓగా విజయలక్ష్మి

చాట్రాయి: మండల ఈఓపీఆర్‌డీగా పనిచేస్తున్న విజయలక్ష్మి చాట్రాయి అదనపు ఎంపీడీఓగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా ముసునూరు ఎంపీడీఓ జి.రాణి విధులు నిర్వహించారు.

250 మందికి వైద్య పరీక్షలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ కార్మికులకు ఉచిత వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. రైల్వే వైద్యశాల డాక్టర్లు ఎ.శ్రీనివాసులు, పి.సుధాకర్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఆంధ్ర హాస్పటల్ వైద్యులు, సిబ్బంది రైల్వే ఉద్యోగులు, కార్మికులు 250 మందికి గుండె, కిడ్నీ, కంటి తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆంధ్రా హాస్పిటల్ వైద్యులు అచ్యుతబాబు, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

యూనియన్ నేతపై ఏడీఈ దాడి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో ఇంజినీర్ల బదిలీల పర్వం మంగళవారం రాత్రి వ్యక్తిగత దాడులకు దారితీసింది. ఎన్టీటీపీఎస్‌లో దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న ఎలక్ట్రికల్ ఏడీఈ శ్రీధర్‌ను ఇటీవలి కాలంలో అంతర్గత బదిలీ చేశారు. ఇంజినీర్స్ అసోసియేషన్ విజయవాడ బ్రాంచి కార్యదర్శి, మరో ఏడీఈ చక్రధర్ తన బదిలీని అడ్డుకోలేక పోయారనే ఆక్రోశంతో వ్యక్తిగత కక్ష పెంచుకుని చక్రధర్‌పై శ్రీధర్ దాడి చేశాడు. బాధితుడు చక్రధర్ ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజుకు ఫిర్యాదు చేశాడు. తనపై దాడి చేసిన ఏడీఈ శ్రీధర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని సీఈని కోరారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

నూజివీడు: రైతులకు పంటల సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంపొందించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఉద్యాన అధికారి ఆర్. హేమ అన్నారు. మండలంలోని పాత రావిచర్లలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మామిడి తోటలను సందర్శించి తోటల పరిస్థితిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మామిడి తోటలను పూతకు సిద్ధం చేయాలన్నారు. పూత బయటకు రావడానికి మల్టీకే 10 గ్రాములు లీటరు నీటికి, బోరాన్ 2 గ్రాములు లీటరు నీటికి, జింక్ 2 గ్రాములు లీటరు నీటికి, ఇమిడాక్లోప్రిడ్ 0.5 ఎంఎల్ లీటరు నీటికి లేదా వేప నూనె 1500 పీపీఎం 3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వీహెచ్ఏ జయలక్ష్మి, జెడ్పీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి హేమ, రైతులు



కొత్తగూడెంలో జీవామృతం తయారు చేస్తున్న మహిళలు

సేంద్రియ ఎరువులను వినియోగించాలి

చాట్రాయి: రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. మండలంలోని కొత్తగూడెంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రసాయనిక ఎరువులు వాడడం వల్ల వ్యవసాయ భూముల్లో సేంద్రియ కర్బనం తగ్గి గుల్లబారుతుందని, ప్రకృతి వ్యవసాయం ద్వారా తయారు చేసే ఎరువులను వాడితే వ్యవసాయ భూములు సారవంతం అవుతాయని చెప్పారు. అనంతరం మహిళా రైతులు జీవామృతం, నీమాస్త్రం, అగ్నాస్త్రం తయారు చేసే విధానాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

తిరువూరురూరల్: ఖరీఫ్ వరి సాగులో రైతులు మెలకువలు పాటించాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. బుధవారం మండలంలోని ముష్టికుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వరిపైరులో నీటి యాజమాన్యం, ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఖరీఫ్ సాగుచేసే రైతులు తమ పంటల వివరాలను ఈక్రాప్‌లో నమోదు చేయించి ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి సూచించారు.

ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీ తప్పనిసరి



తుక్కులూరులో ఈ క్రాప్ నమోదును తనిఖీ చేస్తున్న ఆర్డీఓ ఎం. వాణి

నూజివీడు: ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆర్డీఓ మొవిడి వాణి అన్నారు. మండలంలోని తుక్కులూరులో వ్యవసాయ శాఖ సిబ్బంది నిర్వహించిన ఈ క్రాప్ నమోదును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు పూర్తయిన ఈ క్రాప్ నమోదు వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నంబరు, సాగు చేసిన పంట వివరాలు, సాగు చేసిన విస్తీర్ణం తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయా, లేదా అని సంబంధిత రైతులను అడిగి నిర్ధారించుకున్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ రైతులు తాము సాగు చేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయించడం ద్వారా అనేక ప్రయోజనాలు చేకూరతాయని చెప్పారు. ప్రభుత్వ పరంగా రైతులకు అమలు చేసే పథకాలు వర్తిస్తాయని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తారన్నారు. సాగు చేసిన పంటలను మాత్రమే ఈ క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. రైతులు కూడా వ్యవసాయ శాఖ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆలూరి చాముండేశ్వరి, సర్పంచి తొమ్మండ్రు బుజ్జి, వీఆర్వోలు ఉషారాణి, దుర్గామల్లేశ్వరి, రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు సారె సమర్పణ



గంపలగూడెం: గంపలగూడెం గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి మహిళలు సారె సమర్పించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, గాజులు, చలిమిడి, నూతన వస్త్రాలను అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. మహిళలు విశేషంగా పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు నివాళి

ఇబ్రహీంపట్నం: పోరాట యోధుడు మాన్యశ్రీ కాన్షీరామ్ వర్ధంతి కార్యక్రమం ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో బుధవారం నిర్వహించారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మందా నాగమల్లేశ్వరరావు కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారమే అన్ని సమస్యలకు పరిష్కారం అన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాటలో పయనించిన గొప్ప మహనీయుడు కాన్షీరామ్ అని కొనియాడారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

16 నుంచి అన్నప్రసాద వితరణ

తిరువూరు: స్థానిక శ్రీస్వామి అయ్యప్ప దేవాలయంలో మాలధారులకు ఈ నెల 16 నుంచి అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. ఏటా అయ్యప్ప మాలధారులతో పాటు భవానీలు, శివదీక్షాపరుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. మండల దీక్షలు ముగిసే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

అన్నదానం

గంపలగూడెం: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా గంపలగూడెం రామాలయం వద్ద బుధవారం అన్నసంతర్పణ చేశారు. తొలుత అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రూ. 9.48 కోట్ల ఆదాయం

నూజివీడు: నూతన మద్యం పాలసీలో భాగంగా నూజివీడు నియోజకవర్గంలోని 16 మద్యం షాపులకు బుధవారం సాయంత్రానికి 474 దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. బుధవారం ఒక్క రోజే 200 దరఖాస్తులు వచ్చాయన్నారు. మొత్తం దరఖాస్తుల నుంచి రూ.9.48 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. దరఖాస్తు చేసేందుకు మరో రెండు రోజులు గడువు ఉన్నందున దరఖాస్తులు మరిన్ని వచ్చి ఆదాయం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. దరఖాస్తుదారులతో ఎక్సైజ్ స్టేషన్ కోలాహలంగా మారింది. షాపుల లాటరీలో పాల్గొనేందుకు దరఖాస్తుకు రూ.2 లక్షలు చొప్పున చెల్లించాలి. ఈ డబ్బు తిరిగి చెల్లించరు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఎక్సైజ్ సీఐ పర్యవేక్షిస్తున్నారు. మొదటి ఏడాది (2024–25) లైసెన్స్ ఫీజు రూ.65 లక్షలుగా, తరువాతి సంవత్సరం (2025–26)కు 10 శాతం పెంచి రూ.71.50 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది.

మద్యం షాపులకు 350 దరఖాస్తులు

మైలవరం: మైలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండలాల్లో మద్యం షాపుల నిర్వహణకు ఇప్పటి వరకు 350 దరఖాస్తులు అందాయని మైలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. మైలవరం మండలంలో మొత్తం 4 మద్యం షాపులకు గాను 200 దరఖాస్తులు, జి.కొండూరు మండలంలో 4 షాపులకు గాను 120, రెడ్డిగూడెం మండలంలో రెండు షాపులకు గాను 60 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 14వ తేదీన ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వద్ద స్వర్ణ కన్వెన్షన్‌లో లాటరీ తీస్తారని సీఐ శ్రీనివాస్ వివరించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ఆగిరిపల్లి: గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ భార్గవి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఉప సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు భార్గవి అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారంపై భార్గవి అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ ఆనంద్‌బాబు, ఏఓ అబ్దుల్ సలాం, పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సరస్వతీ.. నమస్తుభ్యం



నూజివీడులో జ్ఞాన సరస్వతీదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడు కోటమహిషాసురమర్దిని ఆలయంలో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు



వెల్లటూరు వేణుగోపాలస్వామి ఆలయంలో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ



కాచవరం రామలింగేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు




తోటమూలలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు



జూపూడిలో అమ్మవారికి దుర్గమ్మ మాలధారుల పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఏడో రోజుకు చేరాయి. మూలా నక్షత్రం కావడంతో అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. పలువురు దాతలు పిల్లలకు పలకలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఆలయాలు ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడాయి. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీలు, ఉత్సవాల నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



తిరువూరు కనకదుర్గాలయంలో సరస్వతీదేవి అలంకారం



తిరువూరు కోదండ రామాలయంలో బాలలతో సరస్వతీదేవికి పూజలు



మైలవరం పాండురంగ స్వామి ఆలయంలో అమ్మవారు



నెమలిలో విద్యాలక్ష్మిగా రాజ్యలక్ష్మీదేవి అమ్మవారు



మెట్టగుట్టపై సరస్వతీదేవిగా గజలక్ష్మీదేవి



తిరువూరు మండలం రోలుపడిలో సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు



బలివేలో సరస్వతీ మాతగా పూజలందుకుంటున్న అమ్మవారు



తిరువూరు అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారి అలంకరణ